క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హైస్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షల్లో ప్రొద్దుటూరు తఖ్వా హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ఖురేషి సుమయ్య షాకీర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం తఖ్వా హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మహ్మద్ షాకీర్ ఖురేషి మాట్లాడుతూ ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా వీవీఎం పరీక్షలు నిర్వహిస్తాయన్నారు. వీవీఎం 2024–25 పరీక్షల్లో తమ హైస్కూల్ విద్యార్థిని ఖురేషి సుమయ్య షాకీర్ జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని కరస్పాండెంట్‌తో పాటు జిల్లా వీవీఎం కోఆర్డినేటర్ రామిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, హైస్కూల్ హెడ్‌మిస్ట్రెస్ శిరీష, వీవీఎం సెల్ కోఆర్డినేటర్ జయ భారత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, శివ, కిరణ్ అభినందించారు.

హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, ఫీజు, ఉపాధ్యాయుల జీతాలు, అర్హత తదితర వివరాలను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా ప్రైవేట్ విద్యావ్యవస్థలో ప్రక్షాళనకు హైకోర్టు మార్గం చూపిందని ఆయన పేర్కొన్నారు. చట్టపరంగా ప్రైవేట్ టీచర్లకు రావాల్సిన హక్కులను పొందుటకు మార్గం సుగమమైందని తెలిపారు.

సివిల్ ఇంజినీరింగ్‌కు డాక్టరేట్



ఎం.మహేష్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన ఎం.మహేష్‌కు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మహేష్ ఎస్వీయూ సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో 'ఎక్స్‌పరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ ఆన్ ఎఫెక్ట్స్ ఆఫ్ డెలిటీరియస్ మెటీరియల్స్ ప్రెజెంట్ ఇన్ ఫైన్ అగ్రిగేట్ ఆన్ ప్రాపర్టీస్ ఆఫ్ జియోపాలిమర్ కాంక్రీట్' అనే అంశంపై ఎస్వీయూకు పరిశోధన పత్రం సమర్పించారు. దీంతో ఎం.మహేష్‌కు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ డాక్టరేట్ ప్రదానం చేశారు.


ఎమ్మెల్యే నివాళి



వెంకటసుబ్బమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, 21వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి ఓబుల్‌రెడ్డి తల్లి భూమిరెడ్డి వెంకటసుబ్బమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ పట్టణంలోని గాంధీనగర్ లో వెంకటసుబ్బమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంతకు ముందు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి కూడా వెంకటసుబ్బమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, సర్పంచ్ జయరామి రెడ్డి, వార్డు ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో ప్రతిభ



విద్యార్థిని పి.శ్రీహర్షిత

ప్రొద్దుటూరు : కడప వైవీయూలో జరిగిన యువ ఉత్సవ్–2024లో స్థానిక దీప్తి జూనియర్ కాలేజీ విద్యార్థిని పి.శ్రీహర్షిత వ్యక్తిత్వ పోటీల్లో పాల్గొని జిల్లా ఫస్ట్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుదర్శన్‌రెడ్డి శనివారం తెలిపారు. శ్రీహర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

రాయలసీమపై కక్ష సాధింపు

ఖాజీపేట (చాపాడు): కడప, రాయలసీమపై చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. మండలంలోని దుంపలగట్టులో శనివారం రెడ్యం విలేకరులతో రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాలకు ప్రధాన కేంద్రంగా వైఎస్సార్ జిల్లా కేంద్రంలో ప్రగతి పథంలో నడుస్తోన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించాలనుకోవడం సహేతుకం కాదని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పునరాలోచించాలని హితవుపలికారు.

అమ్మకు ఆపద

- అధికశాతం గర్భిణుల్లో రక్తహీనత
- ప్రతి ఏటా పెరుగుతున్న సంఖ్య
- చిన్నారుల్లోనూ పోషకాహార లోపం
- మహిళల్లో కొరవడిన అవగాహన



జిల్లా ఆస్పత్రిలో ఓపీ టికెట్ కోసం క్యూలో నిల్చున్న మహిళలు

ప్రొద్దుటూరు క్రైం : రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు, మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. పౌష్టికాహార లోపంతో మాతాశిశు మరణాల సంఖ్య పెరుగుతోందని పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో అనేక మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారంలో పోషకాలు లోపించడంతో రక్తహీనతకు గురవుతున్నారు. ఇది పురుషులతో పోలిస్తే స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా తయారవడం వలన ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత (ఎనీమియా) సమస్య వస్తుంది.

రక్తహీనత మూడు రకాలు

హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్తకణాలలో కనిపించే ప్రొటీన్. రక్తహీనతతో బాధపడుతున్న వారి శరీరంలోని అవయవాలు సరిగా పని చేయకపోవడంతో వారికి అనేక అనారోగ్య సమస్యలు దరి చేరుతాయి. సాధారణంగా ఆడవారిలో ప్రతి 100 మిల్లీ లీటర్ల రక్తంలో 12 గ్రాములు, గర్భిణీ స్త్రీలలో 11 గ్రాములు, బాలింతల్లో 12 గ్రాముల కన్నా రక్తం తగ్గితే వారు రక్తహీనతను కలిగి ఉన్నారని భావించాలి. రక్తం కోల్పోవడం వలన వచ్చే రక్తహీనత, ఎర్రరక్త కణాల ఉత్పత్తి తగ్గడం వలన వచ్చే రక్తహీనత, ఎర్ర రక్తకణాలు నాశనం కావడం వలన వచ్చే రక్తహీనత.. ఇలా రక్తహీనతను మూడు రకాలుగా విభజించవచ్చు.

స్త్రీలల్లోనే రక్తహీనత ఎక్కువ

రక్తహీనత సమస్య స్త్రీలల్లోనే ఎక్కువగా ఉత్పన్నం అవుతుంది. తగినంత పౌష్టికాహారం తీసుకుంటే దీని నుంచి బయట పడొచ్చు. బాలింతలు, గర్భిణులే కాకుండా సాధారణ మహిళల్లో కూడా రక్తహీనత ఉండటం ఆందోళన కలిగించే విషయం. అవగాహన లోపమే ఇందుకు కారణమని తెలుస్తోంది. వైద్య సదుపాయం పొందినా మందులు వాడకపోవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం తదితర కారణాలతో గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడుతున్నారు. ఆహార నియమాలు పాటిస్తూ సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ఈ పరిస్థితి ఉంచి బయట పడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

రక్తహీనతకు ప్రధాన కారణాలు

రక్తంలో ఐరన్ తక్కువగా ఉంటే రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మహిళలు గర్భం దాల్చిన సమయంలో తల్లీబిడ్డకు ఐరన్ అవసరం. అయితే శరీరంలో రక్తం తయారు కావడానికి అవసరమైన ఫోలిక్ యాసిడ్, కాల్షియం, విటమిన్–సీ ఉన్న ఆహారం ఇవ్వాల్సి ఉంది.

రక్తహీనతకు గురైన వారిని ఇలా గుర్తించవచ్చు

- స్త్రీలు పాలిపోయినట్లు కనిపిస్తారు.
- ముఖం ఉబ్బినట్లుగా కనిపించడమే గాక అలసిపోయినట్లు ఉంటారు.
- శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడుతుంటారు.
- గోళ్లు తెల్లగా ఉండటంతో పాటు సన్నగా, బలహీనంగా ఉంటారు.
- అతి నీరసంగా ఉంటూ కాళ్లు, వేళ్లలో వాపు కనిపిస్తుంది.
- హిమోగ్లోబిన్ పరీక్షించినప్పుడు 10 గ్రాముల కంటే తక్కువగా ఉండటం గమనించవచ్చు.

నివారణ చర్యలు ఇలా..

- రోజూ ఒక గ్లాసు పాలు తాగాలి. ఒక గుడ్డుతో పాటు ఏదో ఒక పండు తినాలి.
- ఆరు బయట నడిచేటప్పుడు చెప్పులు వేసుకోవాలి.
- ఐరన్, ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తినాలి.
- అధిక రక్తస్రావం, మొలలు, మలేరియా లాంటి సమస్యలు ఉంటే చికిత్స చేయించుకోవాలి.
- ప్రసవం తర్వాత 4వ నెల నుంచి మూడు నెలల పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను వాడాలి.
- ఆకు కూరలు, కూరగాయలు, వేరుశనగ పప్పు, మాంసం, చేపల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది.

రక్తహీనత కలిగిన వారు ఇలాంటి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి



మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. పోషక విలువలు లోపించకుండా ఆహారాన్ని తీసుకోవాలి. ప్రసవం తర్వాత కూడా ఆరు నెలల వరకు హిమోగ్లోబిన్ సాధారణ స్థాయి కంటే తక్కువ లేకుండా చూసుకోవాలి. తక్కువగా ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ సూచన మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ మీనాకుమారి, గైనకాలజిస్టు, జిల్లా ప్రభుత్వాసుపత్రి, ప్రొద్దుటూరు

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత



పౌష్టికాహారం లోపం వల్లనే గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కలుగుతోంది. ఆకు కూరలు, కూరగాయలు, మాంసకృత్తులు కలిగిన ఆహారంతో పాటు బెల్లం–శనగ ఉండలు తింటే ఐరన్ వస్తుంది. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

– డాక్టర్ మహాలక్ష్మి, వైద్యాధికారి, కల్లూరు పీహెచ్‌సీ

దోమలు పుట్టకుండా చేద్దాం



బద్వేలు అర్బన్ : గంబూషియా చేపలు వదులుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారులు



ప్రొద్దుటూరు క్రైం: చెరువులో గంబూషియా చేపలు వదులుతున్న వైద్యాధికారులు

బద్వేలు అర్బన్ : దోమలు పుట్టకుండా చేయాలని, ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారులు టి.నరసింహారెడ్డి, ఎం.బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. బద్వేలు, పోరుమామిళ్ల ప్రాంతాలలోని పలు చోట్ల దోమల నివారణ చర్యల్లో భాగంగా శనివారం మంచినీటి కుంటల్లో గంబూషియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు, జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ ఆదేశాల మేరకు గంబూషియా చేపలు మురుగు కాలువల్లో వదిలామని తెలిపారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులకు మూలకారణమైన దోమలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు దోమల నివారణ చర్యలు పాటించాలని కోరారు. గంబూసియా చేపల ద్వారా మంచినీటి కుంటల్లో పెరిగే దోమల పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలి

ప్రొద్దుటూరు క్రైం : దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే వాటిని పూర్తిగా నిర్మూలించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని చెన్నంరాజుపల్లె, అమృతానగర్, కామనూరు, నరసింహాపురం, కాకిరేనిపల్లె, గోపవరం గ్రామాల్లోని కుంటలు, కోనేరులలో గంబూషియా చేపలు వదిలారు. గంబూషియా చేపలు నీళ్లలో లార్వా వృద్ధి చెందకుండా నివారిస్తాయని డాక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై దోమలు దాడి చేసి మలేరియా, డెంగీ వ్యాప్తి చేస్తుంటాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, మాధవరెడ్డి, సీహెచ్‌ఓలు రజియా, సంధ్య, ఆరోగ్య కార్యకర్తలు నాగసుహాసిని, ప్రమీలా, ఆశా కార్యకర్తలు కల్యాణి, బిందు, ప్రభావతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



జామ పండ్లను పరిశీలిస్తున్న నాచుర్ ఫామింగ్ జిల్లా కో ఆర్డినేటర్ నాగమణి తదితరులు

చాపాడు: ప్రకృతి వ్యవసాయ విధానంలో ద్వారా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని నాచురల్ ఫామింగ్ జిల్లా కో ఆర్డినేటర్ నాగమణి అన్నారు. మండలంలోని రాజువారిపేట వద్ద ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన జామ తోటను శనివారం నాచురల్ ఫామింగ్ కో ఆర్డినేటర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయంలో జామ తోటలో అంతర పంటలు వేస్తూ రెండు ఎకరాల జామ తోటను సాగు చేస్తున్నారని తెలిపారు. ఇందులో రైతు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం అందిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు మెంటార్ రామాంజనేయులు, చెన్నకేశవరెడ్డి, నాగవేణమ్మ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



విజేతకు టీసీఎల్ టీవీని అందజేస్తున్న ఎంఆర్ హోండా షో రూం ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ఎంఆర్ హోండా షో రూంలో శనివారం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలకు ఆ సంస్థ ఎండి ముమ్మడిరెడ్డి మహీంద్రారెడ్డి బహుమతులు అందచేశారు. మొదటి బహుమతి టీసీఎల్ 55 గూగుల్ టీవీని ప్రొద్దుటూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి, రెండవ బహుమతి ఫ్రిజ్ పులివెందులకు చెందిన పి ప్రశాంతి, మూడో బహుమతి వాషింగ్ మిషన్ వీఎన్‌పల్లె మండలం, అయ్యవారిపల్లెకు చెందిన కె రమేష్ గెలుచుకున్నట్లు మహీంద్రారెడ్డి తెలిపారు. వీటితో పాటు 20 మందికి కన్సోలేషన్ ప్రైజ్‌లను అందచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముమ్మడిరెడ్డి నరేంద్రారెడ్డి, జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్, ఏజీఎం షెక్షావలి, సేల్స్‌మేనేజర్ గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

బద్వేలు అర్బన్ : విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తామని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు వెలుతుర్లర విశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బద్వేలులో నిర్వహించిన ఆర్ఎస్‌యూ 10వ జిల్లా మహాసభల సందర్భంగా సిద్దవటం రోడ్డు నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఖాళీగా ఉన్న వార్డెన్ ,ఏఎస్‌డబ్ల్యూఓ, ఏబీసీడబ్ల్యూఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో జరుగుతున్న ఘటనల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రశాంత్, వంశీ, జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబు, కడప నగర అధ్యక్షుడు వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం

చాపాడు: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపం 2.0 అమలు చాలా లోపభూయిష్టంగా ఉందని, మొదట చెప్పినట్లు కాకుండా అనేక నిబంధనలు పెట్టారని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1.64కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు ఉంటే ఇందులో 55లక్షలు దీపం, 9లక్షలు ఉజ్వల, 5లక్షలు సీఎస్ఆర్ కనెక్షన్లు కాగా మిగిలినవన్నీ సాధారణ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి ఎల్పీజీ, రైస్, ఆధార్ కార్డు కలిగిన వారందరూ అర్హులని కూటమి ప్రభుత్వ మొదట ప్రచారం చేశారని, కానీ జీఓ ఎంఎస్ నెం.12 ప్రకారం ఎల్పీజీ, రైస్, ఆధార్ కార్డు డేటా, ఇతర శాఖల డేటాబేస్ వాలిడేషన్‌లో మ్యాచ్ అయి ఉండాలనే నిబంధనలను విధించారని పేర్కొన్నారు.

గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ గుర్తింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్ఏఏసీ (న్యాక్) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ శనివారం తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో నాక్ బృందం కళాశాలను పరిశీలించిందని ఆమె పేర్కొన్నారు. నాక్ బృందంలో దీన్‌బంధు ఛోటు రామ్ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ మనోజ్ దుహాన్, ఒరిస్సాలోని ఎంఎస్‌సీబీ యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ హిమబిందు, తెలంగాణలోని కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచి ప్రొఫెసర్ వెంకట మురళీమోహన్ ఉన్నారన్నారు. వీరు రెండు రోజులు కళాశాలలోని వివిధ విభాగాలు, బోధనా పద్ధతులు, పరిశోధన అంశాలు, సేవా కార్యక్రమాలు, ప్రయోగశాలలు తదితర అంశాలను పరిశీలించారని తెలిపారు. కళాశాలకు బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్‌ను నాక్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ, అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా అభినందించారు.

పుస్తక పఠనం.. విజ్ఞాన సోపానం



పోరుమామిళ్ల: పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అట్లూరు గ్రంథాలయంలో..

ప్రొద్దుటూరు : పుస్తక పఠనం విద్యార్థుల విజ్ఞాన సోపానమని విశ్రాంత ఉపాధ్యాయుడు చాడ మునిరెడ్డి అన్నారు. స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయోద్యమ కారుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చాడా మునిరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞాన వంతులై దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్లు బాలకృష్ణ, నాగరాజు, గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

రాజుపాళెం : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలంగి కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ అధికారి ప్రతాపుడు, ఉపాధ్యాయులు చంద్ర ఓబుళరెడ్డి, రషీద్ ఖాన్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

అట్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయాధికారి అధికారి ఎం.సుధాకర్, శ్రీవిద్యా హైస్కూలు కరస్పాండెంట్ సి.మస్తాన్ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పోతూరి నాగభూషణం చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని సూచించారు. గ్రంథాలయాలకు వెళ్లి మంచి పుస్తకాలు పఠనం చేయడం వలన విజ్ఞానం వికసిస్తుందని తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వసంత పేట మున్సిపల్ హైస్కూల్‌లో వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యపఠనం పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు డి.సుజాతమ్మ పర్యవేక్షణలో 6, 7 తరగతుల విద్యార్థులకు పద్యపఠనం, 8, 9 తరగుతల విద్యార్థులకు చిత్రలేఖనం, 10వ తరగతి విద్యార్థులకు వాతావరణ కాలుష్యం అనే అంశంపై వ్యారచన పోటీలు నిర్వహించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రాజు, విశ్రాంత తెలుగు పండితుడు వెంకటేశులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతులు అందిస్తామని రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ సుభాష్, టీచర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

పోరుమామిళ్ల: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అధ్యక్షతన పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పుస్తకాలు విజ్ఞాన బాండాగారాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



రాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ప్రొద్దుటూరు కల్చరల్ : పద్య పఠనం పోటీలో పద్యాలు చదువుతున్న విద్యార్థిని



ప్రొద్దుటూరు : గ్రంథాలయ ఉద్యమకారులకు పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి

కనుల పండువగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవ కార్యక్రమానికి హాజరైన భక్తులు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో కనుల పండువగా కోటి దీపోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ దంపతుల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి వార్లను మాడ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించాలి



డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమను నిర్మిస్తామని పేర్కొన్నారని, ఆ మేరకు ఉక్కు పరిశ్రమను నిర్మించాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2007 నుంచి 2023 మధ్యలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని తెలిపారు. అయితే పరిశ్రమను నిర్మించడంలో విఫలమయ్యారన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాయుడు అప్పట్లో నిరాహార దీక్ష చేశారని గుర్తుచేశారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా పక్షం పార్టీ నాయకులు శివరామకృష్ణ, అబ్దుల్ కరీం, మల్లికార్జున శెట్టి, నరాల బాలిరెడ్డి, రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, యోహన్ పాల్గొన్నారు.